క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



తహసీల్దార్ మాధవరాజుకు వినతిపత్రం అందజేస్తున్న హరిప్రసాద్

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె పాఠశాలను జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు నాణ్యంగా సకాలంలో చేపట్టాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి, ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

చౌడేపల్లె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం కేటాయించిన రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ వైస్ చైర్మన్ ఉత్తరాది హరిప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఈ మేరకు తహసీల్దార్ మాధవరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాలు కొన్ని సక్రమంగా తిరగడంలేదన్నారు. బినామీ డీలర్ల ద్వారా విక్రయాలు చేస్తున్నారన్నారు. వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు త్యాగరాజు, గంగులమ్మ

పుంగనూరు: పట్టణంలోని కోనేటిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను కౌన్సిలర్లు పూల త్యాగరాజు, గంగులమ్మ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ తల్లీబిడ్డ క్షేమంగా ఉండేందుకే ప్రభుత్వం నాణ్యమైన పోషక పదార్థాలను అంగన్‌వాడీల ద్వారా పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సునంద తదితరులు పాల్గొన్నారు.

టీబీ బాధితులకు..

గంగవరం: టీబీ బాధితులకు పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దాతలు పట్టణానికి చెందిన శ్రీపురం సీతారామయ్య, మంజునాథ్ సహకారంతో పోషకాహార సరుకులను పంపిణీ చేశారు. పలమనేరు పట్టణంలోని ఎన్జీఓ కార్యాలయం వద్ద మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారం అందజేయడంతో రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్యాధికారి మల్లికార్జున తెలిపారు. వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోవాలని దాతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు, పీపీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు



పుంగనూరు: పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న విరూపాక్షి మారెమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వేకువజాము నుంచి అమ్మవారికి పూజలు చేసి, చలిపిండి, దద్దోదనం నైవేద్యం పెట్టి, నెయ్యి దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : యువతకు స్వామి వివేకానంద ఆదర్శం కావాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ హేమంత్ అన్నారు. మంగళవారం నగరంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను పురస్కరించుకుని ముందస్తుగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశం గొప్పతనం ప్రపంచం నలుమూలలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి వివేకానంద అని తెలిపారు. యువత ఆయన అడుగు జాడల్లో నడవాలని కోరారు. అనంతరం నగరంలో కట్టమంచి వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ పట్టణ కార్యదర్శి పురుషోత్తం, పీవీకేఎన్ వైస్ ప్రెసిడెంట్ హేమంత్ పాల్గొన్నారు.

వైద్య సేవల పరిశీలన

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ సందర్శించారు. డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రకాశంతో శాఖపరమైన సేవలు, విధులు తదితర అంశాలను తెలుసుకున్నారు. విభాగాల వారీగా పనిచేసే అధికారులు, సిబ్బంది, పీహెచ్‌సీల పనితీరు, మందులు, మాత్రల నిల్వలపై పూర్తి స్థాయిలో సమీక్షించారు.

నోటు పుస్తకాల పంపిణీ

గుడిపాల : బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలోని 135 మంది విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన రాజేష్ కన్నన్ ఒక్కొక్కరికి రెండు నోటు పుస్తకాలు, రెండు పెన్నులను వితరణగా అందజేశారు. కళాశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు.

సంక్షేమం.. గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సదుం: జోగివారిపల్లెలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



బూరగమంద పంచాయతీలో గ్రామస్తులతో ముచ్చటిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- 41 గ్రామాల్లో మంత్రి పర్యటన
- ఘన స్వాగతం పలికిన ప్రజలు

సదుం: పేదల సంక్షేమం.. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పల్లెల్లో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని బూరగమంద, మొరవపల్లె, జోగివారిపల్లె, చెరుకువారిపల్లె, నడిగడ్డ గ్రామ పంచాయతీల్లోని 41 గ్రామాల్లో మంగళవారం ఆయన పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా సీతన్నగారిపల్లెలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, మొరవపల్లె, దేవదారుమాకులపల్లెలో రూ. 8.5 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం, బూరగమంద, నడిగడ్డలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, జోగివారిపల్లెలో రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే నూతన భవనాలను మంత్రి ప్రారంభించారు. కొత్తవడ్డిపల్లెలో 18 మందికి రీసర్వే భూహక్కు పత్రాలను అందజేశారు. నడిగడ్డలో పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆశించిన మేర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం దక్కిందని చెప్పారు. పలు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైస్ ఎంపీపీ అమరావతి, సర్పంచ్‌లు వెంకటరమణ, జగన్నాథం, అనితాకుమారి, ఐశ్వర్య, నారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, నాయకులు దామోదరరెడ్డి, వెంకటరెడ్డి, ఈశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పుత్రాజు, పాపిరెడ్డి, ఇమ్రాన్, మధుసూదన్‌రెడ్డి, బాబురెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరినాథరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి పర్యటన ఇలా..

మండలంలోని పాలమంద, 79ఏ చింతమాకులపల్లె, చింతలవారిపల్లె, ఊటుపల్లె గ్రామాల పరిధిలోని 38 గ్రామాల్లో మంత్రి పెద్దిరెడ్డి బుధవారం పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేయనున్నారు.

బోయకొండలో రూ.60 లక్షలతో నూతన ఆర్చి



మంత్రి పెద్దిరెడ్డితో ఆలయ కమిటీ చైర్మన్ శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం సమీపంలోని భవానీనగర్(బోయకొండ క్రాసు) వద్ద రూ.60లక్షల వ్యయంతో సుందరంగా ఆర్చి ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి మంగళవారం ఎర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు. మాస్టర్ ప్లాన్‌లో రూపొందించిన మేరకు క్రాసు వద్ద అత్యంత సుందరం, ఆకర్షణీయంగా ముఖద్వార ఆర్చి ఏర్పాటు చేయడానికి మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అలాగే బోయకొండ గంగాపురంలో శిథిలావస్థకు చేరువలో ఉన్న భవనాలను తొలగించి, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అభివృద్ధి పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. మాస్టర్‌ప్లాన్ మేరకు బోయకొండలో అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. వేలం పాటల గడువు పూర్తి అయ్యిందని, గతంలో తీసుకున్న వేలం పాట నిర్వాహకులకే 10 శాతం అదనంగా కేటాయించి మళ్లీ వారికే ఏడాదిపాటు వివిధ హక్కులకు లీజు గడువు పెంచాలని మంత్రి ఈ సందర్భంగా చైర్మన్, ఈఓకు సూచించారు.

మంత్రి పెద్దిరెడ్డి సొంత నిధులతో సిమెంట్ పంపిణీ



సిమెంట్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్

సోమల: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నిధులతో 58 కుటుంబాలకు అందజేసిన సిమెంట్‌ను ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అమాసమోహన్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమాస మోహన్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన మంత్రి పల్లెబాట సందర్భంగా ఆవులపల్లె పంచాయతీలోని కొత్తూరు ఇర్లపల్లె, గుట్టకింద పల్లె, రాంపల్లె దళితవాడ గ్రామాల ప్రజలు గత ప్రభుత్వంలో ఇచ్చిన కాలనీ ఇళ్లు వర్షాలకు ఉరుస్తున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సిమెంట్ అందజేస్తానని హామీ ఇచ్చారని, ఈ క్రమంలో ప్రతి కుటుంబానికి 5 బస్తాల చొప్పున 290 బస్తాల సిమెంట్‌ను పంపారని తెలిపారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ అధ్యక్షుడు గంగాధరం, వైస్ ఎంపీపీ ప్రభాకర, సర్పంచ్ కొదండరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీరాములు, నాయకులు బెంగళూరు సాంబయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి

గంగవరం: బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న సీఐటీయూ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గిరిధర్‌గుప్త, సుబ్రమణ్యం కోరారు. మంగళవారం పట్టణంలో యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మహాసభలకు తప్పక హాజరుకావాలని కోరారు.

జాతీయస్థాయి పోటీల్లో చిన్నారి ప్రతిభ



యశ్వికను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఆజాద్

శాంతిపురం: కూతేగొనిపల్లె వద్ద ఉన్న పరమహంస యోగానంద పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న వై.యశ్విక జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చూపి, ప్రథమ బహుమతి పొందినట్టు ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఆజాద్‌హుస్సేన్ తెలిపారు. వీరగాథలపై 3–5 తరగతుల విద్యార్థులకు సీబీఎస్సీ నిర్వహించిన పోటీల్లో సైనికుల త్యాగాలపై గీసిన పెయింటింగ్‌కు ఈ బహుమతి లభించిందన్నారు. రాష్ట్ర విద్యార్థి దేశస్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించడంపై అమరావతి నుంచి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ శాఖ అధికారులు అభినందనలు తెలిపారని ఆయన చెప్పారు. ఈ నెల 26న ఢిల్లీలో జరగబోయే కార్యక్రమంలో బహుమతిని అందిస్తారన్నారు. కాగా పాఠశాల విద్యార్థికి జాతీయ స్థాయిలో గౌరవం దక్కడంపై విద్యాసంస్థ చైర్మన్ గోపాల్ జి అగర్వాల్, జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. యశ్వికను, శిక్షణ ఇచ్చిన డ్రాయింగ్ టీచర్ సుమను వారు అభినందించారు. కాగా యశ్విక తల్లి దుర్గారాణి రాళ్లబూదుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో మహేష్‌కు కాంస్యం



పుంగనూరు: ఇండియన్ ఆర్మీ, తఫిసా సంయుక్తంగా తెలంగాణలో నిర్వహించిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన ఎం.రెడ్డిమహేష్ కాంస్య పతకం సాధించాడు. మంగళవారం రెడ్డిమహేష్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో 8 రాష్ట్రాలకు చెందిన బాక్సర్లు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో తనకు కాంస్య పతకం లభించిందన్నారు.

డిగ్రీ కళాశాలలో ఇన్‌టర్న్‌షిప్ తప్పనిసరి



ఇన్‌టర్న్‌షిప్ సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

గంగవరం: నూతన విధానం 2020 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని డిగ్రీ కళాశాలల్లో ఇన్‌టర్న్‌షిప్ తప్పనిసరిగా చేసిందని ఎస్‌వీసీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు. పలమనేరు పట్టణంలోని ఎస్‌వీసీఆర్ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు ఏపీఎస్ ఆర్టీసీలో ఏ సర్వే ఆన్ ఫంక్షనల్ యాక్టివిటీస్ ఆఫ్ ఏపీఎస్ ఆర్టీసీ ప్రాజెక్ట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథ్‌రెడ్డి, డిపో మేనేజర్ రామకృష్ణారెడ్డి పాల్గొని విద్యార్థులకు ఇన్‌టర్న్‌షిప్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

బంగారుపాళెం: విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు అన్నారు. మంగళవారం ఎగువ రాగిమాను పెంట జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నాడు-నేడు పనుల పురోగతిని హెచ్‌ఎం సుజాతను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, పలు సూచనలు ఇచ్చారు.

వరసిద్ధునికి విరాళాల వెల్లువ



విరాళం అందజేస్తున్న దాత జయదేవ్



విరాళం అందిస్తున్న వెంకటమధు



విరాళం ఇస్తున్న హరికృష్ణ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి మంగళవారం దాతలు రూ.3 లక్షలు విరాళం అందజేశారు. పూతలపట్టు మండలం సంజీవిరాయనపల్లెకు చెందిన జయదేవ్ స్వామి వారి నిత్యాన్నదానానికి రూ.50 వేలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50 వేలు, వైఎస్సార్ కడప జిల్లా అక్కయ్యపల్లెకు చెందిన దాత హరికృష్ణ స్వామివారి నిత్యాన్నదానానికి రూ.లక్ష, మైదుకూరుకు చెందిన దాత వెంకట మధుశేఖర్ స్వామివారి నిత్యాన్నదానానికి రూ.50 వేలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50 వేలు విరాళాలను ఆలయాధికారులకు అందజేశారు. దాతల కుటుంబసభ్యులకు ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్‌లు కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, బాబు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రొంపిచెర్ల: అనారోగ్యంతో మృతి చెందిన అజరుద్దీన్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా అన్నారు. రొంపిచెర్ల పంచాయతీలోని చిన్న మసీదువీధిలో అనారోగ్యంతో మృతి చెందిన అజరుద్దీన్ (40) కుటుంబాన్ని మంగళవారం వారు పరామర్శించి, తాము అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. వారి వెంట సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కరీముల్లా, అబుబక్కర్, మహబుబ్‌బాషా, గురు తదితరులు ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం



గోపి

పుంగనూరు: పట్టణంలోని తాటిమాకులపాళెం నివాసి రామకృష్ణప్ప కుమారుడు జి.గోపికి ఎస్వీయూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మంగళవారం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో డిజైన్ డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ నికార్డిఫినోసిల్ నానోపర్టికులర్ ఫార్ములేషన్స్‌పై పరిశోధన పత్రాలు సమర్పించానని చెప్పారు. కృష్ణా యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ చంద్రశేఖర్, డాక్టర్ కుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు గోపిని అభినందించారు.

వినాయకుని సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



వాణీమోహన్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారిని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ (పురావస్తు శాఖ, పర్యావరణ, క్రీడ) వాణీ మోహన్ మంగళవారం దర్శించుకున్నారు. ఆమె స్వామివారి దర్శనార్థం ఆలయానికి విచ్చేయగా ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

చట్టాలను కాపాడుకుంటాం

గుడిపాల: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నీరుగార్చే ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర పిలుపునిచ్చారు. సీఐటీయూ మహాసభలు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా యూనియన్ జెండాలను ఎగురవేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యూనియన్లు పెట్టుకునేందుకు కూడా హక్కు లేకుండా, శ్రమ దోపిడీని మరింత పెంచుచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కోడ్‌లను తీసుకురానుందని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ బావుటా బుక్‌లెట్లను అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: వివక్షకు తావు లేకుండా రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 30 సొన్నేగానిపల్లె పంచాయతీలోని నాయనపల్లెలో ఆయన మంగళవారం ఇంటింటి పర్యటన నిర్వహించారు. ప్రతి పేద కుటుంబానికి పక్కాఇల్లు మంజూరు చేయడానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే రెండు దఫాలు ఇళ్లు ఇవ్వగా త్వరలోనే మూడో విడత ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరడంతో ప్రజలు సీఎంను తమ కుటుంబంలో ఒకరిగా ఆదరిస్తూ గుండెల్లో పెట్టుకున్నారని చెప్పారు. నాయనపల్లె, కూతేగొనిపల్లెలో అపరిష్కృతంగా ఉన్న మురుగు కాలువల నిర్మాణానికి తన కోటాలో ఎమ్మెల్సీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు.

ఆస్తులు లాక్కున్నారు..!

భర్త లేని తన ఆస్తులను ఆయన తరపు బంధువులు లాక్కున్నారని రామకుప్పం మండలం గొరివిమాకులపల్లెకు చెందిన కన్నమ్మ ఎమ్మెల్సీ భరత్‌కు ఫిర్యాదు చేశారు. నాయనపల్లెలోని తన కుమార్తె ఇంట్లో తలదాచుకుంటున్న ఆమె గ్రామానికి వచ్చిన భరత్‌ను కలిసి తన గోడును తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సమస్య వివరాలను పూర్తిగా పరిశీలించి, కన్నమ్మకు న్యాయం చేయాలని రామకుప్పం తహసీల్దార్, ఎస్‌ఐలను ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ పట్టాభి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణమూర్తి, వక్కలిగర అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ సుకుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, నాయకులు విజయకుమార్, దుబాయ్‌గౌడు, మురుగేష్, శ్రీనివాసులు, తేజ, తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి కానుక అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

ప్రజా సేవకులకు సంక్రాంతి కానుక

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందిస్తున్న ప్రజాసేవకులకు సంక్రాంతి కానుక పంపిణీ చేసినట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. మంగళవారం కుప్పం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నియోజకవర్గంలోని సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, ఏఎన్‌ఎంలకు సంక్రాంతి కానుక అందజేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరవేయడానికి క్షేత్రస్థాయిలో ఉన్న ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ సంక్రాంతి పర్వదినాన సుఖసంతోషాలతో వారు జీవనం సాగించాలని కోరుతూ ప్రతి ఒక్కరికీ సంక్రాంతి కానుక అందిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరంతరం సంక్షేమ పథకాల అమలు కోసం కృషి చేసిన ప్రజా సేవకులకు ఇది చిరుకానుక అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధీర్, కమిషనర్ రవిరెడ్డి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం



ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాల్గొవరోజు ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో కొలువు దీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఆలయంలో రెండు విడతలుగా శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున వ్రత పూజల్లో పాల్గొన్నారు.. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, బాబు పాల్గొన్నారు.

స్వర్ణరథంలో విహరించిన గణనాథుడు



ఊరేగింపులో పాల్గొన్న ఆలయాధికారులు

సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శ్రీవరసిద్ధి వినాయకస్వామి సిద్ధి, బుద్ధి సమేతంగా మంగళవారం రాత్రి స్వర్ణరథంలో ఆలయ మాడ వీధుల్లో విహరించారు. స్వర్ణరథం విహరిస్తున్న స్వామివారిని దర్శించి భక్తులు తన్మయత్వం చెందారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు. ఈఈ వెంకటనారాయణ, ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, వెస్ట్ సీఐ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.